కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బీఐఆర్‌డీ) గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా కరీంనగర్ జిల్లాకు చెందిన నాఫ్‌స్కాబ్, టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు వరుసగా రెండోసారి నామినేట్ అయ్యారు. దక్షిణ భారత సహకార రంగానికి రెండోసారి నామినేట్ కావడం అరుదైన గౌరవంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని ఎన్‌సీడీసీ వివిధ రకాల రుణాలు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సహాయం మంజూరు చేయడానికి, దాని ఆర్థిక సామర్థ్యం పెంపొందించేందుకు ఒక ప్రధాన సంస్థకు గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా నామినేట్ అయ్యారు. మూడేళ్ల పదవీ కాలంలో ఆయన ప్రతి త్రైమాసికంలో ఒకసారి జరిగే సమావేశంలో పాలక మండలి సభ్యుడిగా పాల్గొంటారని ఉద్యోగులు పేర్కొన్నారు. నాబార్డు ప్రధాన సంస్థ అయిన బీఐఆర్‌డీ పాలకమండలి సభ్యుడిగా తిరిగి నామినేట్ అయిన కొండూరు రవీందర్‌రావు ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. గ్రామీణ సహకార రంగం, వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులందరికీ శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంచేందుకు బీఐఆర్‌డీ పనిచేస్తుందని తెలిపారు. దేశంలోనే ప్రధాన సంస్థలైన ఎన్‌సీడీసీ, బీఐఆర్‌డి సంస్థలకు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా రవీందర్‌రావు తిరిగి నామి నేట్ కావడం తెలంగాణ రాష్ట్ర సహకార రంగానికి, కరీంనగర్ జిల్లాకు గర్వకారణమని పలు వురు ఉద్యోగులు, పాలకవర్గ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 10: అనారోగ్యంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓగులాపూర్‌కు చెందిన రొట్టె శ్రీధర్(26)అనే యువకుడు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కుమారస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలూ బీజేపీవే

- ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు
- మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్


కొండగట్టులో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్

మల్యాల, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారనున్నాయని లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంతో పాటు రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటుందని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన ప్రజాహిత యాత్ర ప్రారంభానికి ముందు బండి సంజయ్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. యాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. తెలంగాణ ప్రజలు రాముని వారసులని రామున్ని నమ్ముకున్న పార్టీకే వాళ్లంత ఓట్లు వేస్తారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నింటా ప్రజలను మోసం చేయగా వారి పేరు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం టైమ్ పాస్ చేయాలని చూస్తుందని సంజయ్ విమర్శించారు. బీజేపీ యాత్రలపై సంజయ్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతామన్నారు. అందుకే ఏడాది క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రంలో 1600 కి.మీ మేర ప్రజా సంగ్రామ యాత్రను చేశానన్నారు. నిరుద్యోగ, రైతుల సమస్యల కోసం పోరాడినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజాహిత యాత్ర ద్వారా కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం మొత్తం ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయడం కోసం ప్రజలను కోరనున్నట్లు వివరించారు. కరోనా సమయంలో ప్రపంచం అతలాకుతలం అయినప్పటికీ మన దేశం సుస్థిరంగా ఉండడం, ప్రజలందరికీ ఉచితం కొవిడ్ టీకాలను అందించిందని అలాగే వివిధ దేశాలకు సరఫరా చేసిందని అన్నారు.

● దేవుళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం శఠగోపం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ దేవుళ్లతో పాటు దేవుళ్లను నమ్ముకున్న భక్తులను కూడా మోసం చేశాడని బండి సంజయ్ ఆరోపించారు. వేములవాడకు రూ.500 కోట్లు, కొండగట్టుకు రూ.100 కోట్లు అని వాటిని ఇవ్వకుండా ఆయా దేవుళ్లకు శఠగోపం పెట్టారని విమర్శించారు. తాను ప్రసాద్ పథకంలో వేములవాడ, కొండగట్టులను చేర్చడానికి చర్యలు తీసుకుంటే బీజేపీకి పేరు వస్తుందనే నెపంతో బీఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఆయన వెంట నాయకులు బింగి వేణు, నేరెళ్ల శ్రావణ్, వెంకటస్వామి, జనగాం రాములు, కొక్కెర మల్లేశం యాదవ్, కెల్లెటి రమేష్, సామ మహిపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు


భీమారంలో స్థానికులతో మాట్లాడుతున్న బండి సంజయ్

● మోదీ గెలిస్తే రామరాజ్యం..

మేడిపల్లి: మోడీ మళ్లీ గెలిస్తే రామరాజ్యం వసుందని.. కాంగ్రెస్ గెలిస్తే ఇటలీ అవుతుందని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రను శనివారం మేడిపల్లిలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ ప్రజలు కలలో కూడా ఊహించని విధంగా అయోధ్యలో రాముడి గుడి నిర్మించామన్నారు. రామ భక్తులు రాముడిని నమ్మే పార్టీకే ఓటువేయాలని కోరారు. రాముడి అక్షింతలను రేషన్ బియ్యం అన్న కాంగ్రెస్ వాళ్లు పీవీ నర్సింహరావుకు భారత రత్న ప్రకటిస్తే కనీసం అసెంబ్లీలో కృతజ్ఞత తీర్మానం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే ఐదు లక్షల కోట్ల రూపాయలు కావాలన్నారు. కానీ బడ్జెట్‌లో 53 వేల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ గల్లంతు అవుతుందని జోస్యం చెప్పారు. తనకు హాని చేయాలని తాంత్రిక పూజలు చేసిన నాయకుడు కేసీఆర్ అని, ఎదుటి వారి నాశనం కోరేవారు తమకి తామే పతనం అవుతారన్నారు. ప్రజా సేవ కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజాసమస్యలపై ప్రజా సంగ్రామ యాత్ర చేస్తే కేసీఆర్ తనపై 100 పైగా కేసులు పెట్టి రెండు సార్లు జైలులో వేయించాడని అవేదన వ్యక్తం చేశారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి 590 కోట్ల 91 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ప్రజాహిత యాత్ర మేడిపల్లితో పాటు కొండాపూర్, మీదుగా బీమారం మండలానికి చేరుకుంది.అయన వెంట చెన్నమనేని డా. వికాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు సత్యానారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్ల మెంటు కన్వీనర్ ప్రవీన్‌రావు, కో కన్వీనర్ ధశరథరెడ్డి, మండల అధ్యక్షులు ముంజ శ్రీనివాస్‌గౌడ్, అన్నడి జలపతిరెడ్డి, జగన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ధర్మరెడ్డి, రాజు, మధు, గణేష్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని ఎంపీ బండి సంజయ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం రాత్రి ప్రజాహిత యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలం లోని ఊరూరా తిరుగుతూ గడప గడపకు తిరిగి మోదీ ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు, పిల్లలతో సెల్ఫీలు దిగుతూ, వృద్ధులను పలుకరిస్తూ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల్లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత పాదయాత్ర నిర్వహించారు. వీధుల వెంట తిరుగుతూ చిన్నారులు, మహిళలు, వృద్ధులకు కరచాలనం చేశారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. రాత్రి మండలంలోని సిరికొండలో బస చేశారు. నియోజకవర్గ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, పిడుగు ప్రతాప్, కొనైడ్డి జలంధర్‌రెడ్డి, బద్రి సత్యం, ఎడ్మల వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

30క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 10: పేదలకు బియ్యం పంచాల్సిన రేషన్ డీలరే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలి పారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సహన సుల్తానా ఆమె భర్త రహీం సహకారంతో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కామారెడ్డికి చెందిన బ్రోకర్‌కు విక్రయించేందుకు కరీంనగర్‌కు చెందిన రేవెల్లి అనిల్‌కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. మహేంద్ర ట్రాలీ వాహనం ద్వారా డ్రైవర్ రేవెల్లి జంపయ్యకు అప్పగించగా అప్పటికే మాటు వేసి రాజపల్లి గ్రామం వద్ద ఉన్న ఎస్ఐ సాంబయ్యగౌడ్‌కు అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారన్నారు. దానిలో పైన ఖాళీగా అన్ని సంచులు లోపల రేషన్ బియ్యం సంచులు పెట్టి తరలిస్తున్నట్లు గుర్తిం చారన్నారు. డ్రైవర్‌ను, వాహనం వెంట ఉన్న డీలర్ భర్త రహీముద్దీన్‌ను అదుపులోకి తీసుకొని విచారించామని చెప్పారు. కరీంనగర్‌కు చెందిన రేషన్ బియ్యం బ్రోకర్ రేవల్లి అనిల్ డీలర్ వద్ద 16 రూపాయలకు కొనుగోలు చేసి వాహనం ద్వారా సిరిసిల్ల మీదుగా కామారెడ్డికి తరలించి కిలోకు రూ. 21విక్రయిస్తున్నాడని తెలిపారు. ఇలా గత కొన్ని రోజులుగా రేషన్ బియ్యం దందా నడిపిస్తున్నట్లు నింధితులు పోలీసుల విచారణలో తెలిపారన్నారు. అనిల్‌కుమార్ కారులో ముందు వస్తు పోలీసుల తనిఖీలను పరిశీలి స్తున్నాడని చెప్పారు. వెనుక బియ్యం డ్రైవర్‌కు సమాచారం ఇస్తూ గుట్టు చప్పుడు కాకుండా తరలించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పీడీఎస్ బియ్యం విక్రయించిన చెల్పూర్ రేషన్ డీలర్ సహన సుల్తానా, అందుకు సహకరించిన రహీం, ట్రాలీ డ్రైవర్ అనిల్‌కుమార్‌లతో పాటు మరో ముగ్గురు రేషన్ బియ్యం బ్రోకర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి సెల్‌ఫోన్, రూ. 10వేల నగదు, మహేంద్ర ట్రాలీ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్సై సాంబయ్య, సిబ్బంది అవినాష్, కుమార్, మొండయ్యను ఏసీపీ అభి నందించారు. సమావేశంలో టౌన్ ఇన్‌చార్జీ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై సాంబయ్య పాల్గొన్నారు.

సింగరేణి పీఆర్‌వోకు జర్నలిజంలో డాక్టరేట్

కరీంనగర్ (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/గోదావరిఖని, ఫిబ్రవరి 10: సింగరేణిలో పీఆర్‌వో పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్‌కు జర్నలిజంలో డాక్టరేట్ లభించింది. నిజామాబాద్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రకటించింది. రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూమెంట్స్ ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూమెంట్ అన్న అంశంపై ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధన చేశారు. సామాజిక, రాజకీయ ఉద్య మాల్లో సోషల్ మీడియా బలమైన పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలోని సోషల్ మీడియా పాత్ర ఎక్కువ ఉందనే విషయాన్ని తన పరిశోధన పత్రంలో సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాపువాడకు చెందిన శ్రీకాంత్ ఎంఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్), ఎంబీఏ, ఎంసీజే, ఎంఎస్‌డబ్ల్యూ పూర్తి చేశాడు. ఎనిమిదేళ్లుగా సింగరేణి కాలరీస్‌లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా, పర్సనల్ అధికారిగా పనిచేస్తున్న శ్రీకాంత్ ప్రజాసంబంధాల అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జీఎం కోఆర్డినేషన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సురేష్, తదితరులు శ్రీకాంత్‌ను అభినందించారు.


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్

ఏటీఎంను కొల్లగొట్టిన దుండగులు

- రూ.27.75లక్షల నగదు అపహరణ
- మరో ఏటీఎంలో చోరీకి యత్నం
- సెక్యూరిటీ అలర్ట్ సమాచారం ఇవ్వడంలో జాప్యం
- రంగంలోకి పోలీస్ బృందాలు


సీసీ కెమెరాకు స్ప్రే చేస్తున్న దుండగుడు, ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో తొలగింపు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 10: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఏటీఎం దోపిడీ దొంగలు తెగబడ్డారు. రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించారు. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని హనుమాన్ దేవాలయం పక్కన ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి 27.75లక్షల నగదును ఎత్తుకెళ్లారు. గోదావరిఖని గంగానగర్‌లోని రాజీవ్ రహదారి పక్కన ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి 1.30గంటలకు రాజీవ్ రహదారి పక్కన గంగానగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి మంకీ క్యాప్ ధరించి స్ప్రేస్ప్రే, కట్టర్‌లతో చొరబడిన దొంగలు సీసీ కెమెరాలకు స్ప్రేస్ప్రే చేశారు. అనంతరం ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా వాహనాల కదలికలు ఉండడంతో విరమించుకున్నారు. అర్థగంట వ్యవధిలో ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడిన దొంగలు సీసీ కెమెరాలకు స్ప్రేస్ప్రే చేసి ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేశారు.అందులో ఉన్న రూ.27.75లక్షలను ఎత్తుకెళ్లారు. ఏటీఎం సెక్యూరిటీ అలర్ట్ సిస్టం కు సమాచారం వెళ్లింది. ముంబైలో ఉన్న ఈ సెక్యూరిటీ అలర్ట్ విభాగం దోపిడీ జరిగిన గంట తరువాత రామగుండం పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. శనివారం తెల్లవారుజామున 3గంటలకు గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ జీవన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీ, ఇతర వివరాలను సేకరించారు.

● రెక్కీతోనే చోరీ..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏటీఎంను కొల్లగొట్టిన ముఠా రెక్కీతోనే చోరీకి పాల్పడినట్టు తెలుస్తుంది. ఏటీఎంలలో పలు ప్రైవేట్ సంస్థలు నగదు నింపే కాంట్రాక్టు తీసుకున్నాయి. హిటాచి సంస్థ బసంత్‌నగర్‌లోని ఎస్‌బీఐ చెస్ట్ బ్యాంకు నుంచి శుక్రవారం రూ.30లక్షలు తీసుకువచ్చి గౌతమినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో లోడ్ చేసింది. సాధారణంగా సాయంత్రం పూట సంబంధిత ఏజెన్సీలు ఏటీఎంలలో నగదు పెడతాయి. బ్యాంకుల సమయం వరకు ప్రజలు తమ అవసరం మేరకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో చోరీకి పాల్పడిన ముఠా గతంలో ఈ తరహా చోరీలకుపాల్పడిన ముఠాగా అనుమానిస్తున్నారు. గంగానగర్‌లో ఏటీఎం రాజీవ్ రహదారి పక్కన ఉండడం, వాహనాలు, జనం కదలికలు ఉండడంతో దాన్ని విర మించుకున్నారు. తరువాత అర్థగంట వ్యవధిలో గౌతమినగర్‌లో ఘటనకు పాల్పడ్డారు. వీరు వాహనంలో వచ్చినట్టు భావిస్తున్నారు. ఒక కారు గౌత మినగర్ రోడ్డు పక్కనే నిలిపి ఉండడం, వాహనాలు వచ్చే సమయంలో పార్కింగ్ లైట్లు వేసినట్టు గుర్తించారు. ఘటన జరిగిన కొద్ది సమయం ముందు పోలీస్ పెట్రోలింగ్ వాహనం అక్కడి నుంచి వెళ్లినట్టు తెలుస్తుంది.

● సెక్యూరిటీ లేదు.. అలర్ట్ సిస్టమూ లేదు..

గతంలో ఏటీఎంలలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించే వారు. ఇప్పుడు సెక్యూరిటీ సేవలను నిలిపివేశారు. దీనికి తోడు ఎక్కడైనా ఏటీఎంలు ధ్వంసం చేసినా, చోరీ చేసినా ముంబైలోని సెక్యూరిటీ అలర్ట్ విభాగానికి సమాచారం వెళుతుంది. క్షణాల్లో సంబంధిత పరిధిలోకి వచ్చే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. శనివారం తెల్లవారుజామున గౌతమినగర్‌లో ఏటీఎం చోరీ ఘటన తరువాత గంటసేపటికి కానీ పోలీసులకు సమాచారం అందలేదు. దీంతో నిందితులను పట్టుకోలేకపోయారు. ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టీములు నిందితుల కోసం గాలిస్తున్నాయి. ఏటీఎంలో డబ్బులు లోడ్ చేసే హిటాచి సంస్థ ప్రతినిధి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 10: ఉద్యోగాలు ఇప్పిస్తామని ముగ్గురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఒక యువతిపై కరీంనగర్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు యువతులు కరీంనగర్ ముకరంపురలోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ పోలీసు ఉద్యోగాలకు శిక్షణ తీసుకుంటున్నారు. గతేడాది అక్టోబర్‌లో అదే హాస్టల్‌కు హన్మకొండకు చెందిన పి.ప్రత్యూష(24) అనే యువతి వచ్చి వారి గదిలో ఉంది. తాను కోర్టు కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకొని వారికి నకిలీ ఐడీకార్డు, పోలీసు డ్రెస్‌తో ఉన్న ఫొటోలు చూపించింది. తాను కూడా సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని తెలిపింది. డబ్బులు పెట్టి పోలీసు ఉద్యోగం పొందానని వారిని నమ్మించింది. ఇద్దరు యువతులకు కూడా డబ్బులు ఇస్తే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపించి ఇద్దరు యువతులతో పాటు వారికి తెలిసిన వ్యక్తి ఒక యువకుడు ముగ్గురి వద్ద పలు దఫాలుగా రూ.5.5 లక్షలు వసూలు చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో వారికి కానిస్టేబుల్ ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు నిలదీశారు. కొంత డబ్బులు తిరిగి చెల్లించి మిగితా డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి శనివారం నిందితురాలు ప్రత్యూషను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఒలింపియాడ్‌లో అచీవర్స్ విద్యార్థుల ప్రతిభ



ఒలింపియాడ్ సర్టిఫికెట్లతో అచీవర్స్ విద్యార్థులు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి10: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాల విద్యార్థులు హమ్మింగ్ బర్డ్ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన సైన్స్ మ్యాథ్స్, స్పెల్ బీ ఒలింపియాడ్ పరీక్షలలో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్స్ ను గెలుపొందారు. జె శ్రీయాన్స్ మూడవతరగతి, జె. చైత్రశ్రీ నాలుగో తరగతి, కె .హర్షత్ వర్మ మూడవ తరగతి, హెచ్. యశ్వంత్‌రెడ్డి, మూడవ తరగతి, ఇషితనాయక్, నాలుగవ తరగతి, జి.సిద్దేశ్వర్‌రెడ్డి, ఐదవతరగతి, ఎం .యశస్విని, నాలుగవ తరగతి. జి శ్రీనిక, నాలుగో తరగతి సర్టిఫికెట్స్ సంపాదించిన వారిలో ఉన్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్.పల్లవి అభినందించారు.

'ఓట్ల కోసమే బండి పాదయాత్ర'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 10: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన పాదయాత్ర ఓట్ల కోసమేనని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓవైపు ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే ఎంపీ బండి సంజయ్ మాత్రం నియోజకవర్గ సమస్యలను గాలికి వదిలేసి పాదయాత్ర పేరుతో సానుభూతి రాజకీయాలకు తెరలేపారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పాదయాత్ర తప్ప నియోజకవర్గ అభివృద్ధిపై ఆయనకు ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహన్, రాష్ట్ర నాయకుడు రహ్మత్‌హుస్సేన్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు, రామిడి రాజిరెడ్డి, కంకణాల అనిల్‌కుమార్, బాలబద్రి శంకర్, మహ్మద్ ఆమర్, పరశురాం పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారుల సమీక్ష

భగత్‌నగర్, ఫిబ్రవరి 10: సమ్మక్క సారలమ్మ మేడారం జాతర ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కరీంనగర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్‌సుచరిత ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమ్మక్క సారలమ్మ మేడారం-2024 జాతరకు రీజియన్ పరిధిలో ఏడు ఆపరేటింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, కరీంనగర్, మంథని, పెద్దపల్లి, 8 ఇంక్లైన్ కాలనీలలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వివిధ పనుల ప్రగతిని సమీక్షించారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో ఏడు పాయింట్లనుండి 750 బస్సులు 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు నడపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భూపతిరెడ్డి, కె సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, పర్సనల్ మేనేజర్ ఎం చంద్రయ్య పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి10:డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024-25, విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈనెల16 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.లక్ష్మీ, కోఆర్డినేటర్ డా.ప్రశాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రారంభమైన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


అగ్ని ప్రతిష్ట నిర్వహిస్తున్న అర్చకులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 10: పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి 42వ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి బ్రహ్మో త్సవ ఆరంభం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, బేరి పూజ, దేవతాహ్వానం అర్చకులు నందకిశోరాచార్యులు, నిఖిలాచార్యులు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సురేందర్, సత్తయ్యగౌడ్, గణపతిరెడ్డి ఏర్పాట్లు చేశారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

వీణవంక, ఫిబ్రవరి 10: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి శ్రీరంగం నుంచి తెచ్చిన దివ్య పవిత్రమాలను పండితుడు రమణాచార్యులు సమర్పించి పవిత్రోత్సం నిర్వహిం చారు. కార్యక్రమంలో నమిలికొండ రమణాచార్యులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొండూరు రవీందర్‌రావు నియామకంపై హర్షం

సైదాపూర్, ఫిబ్రవరి 10: నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బీఐఆ ర్‌డి) గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా కరీంనగర్ జిల్లాకు చెందిన నాఫ్‌స్కాబ్, టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు వరుసగా రెండో సారి నామినేట్ అవడంపై కరీంనగర్ జిల్లా సహకార సంఘాల అధ్యక్షుల ఫోరం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడి శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొండూరి రవీందర్‌రావుకు తిరుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా వైజ్ఞానిక మహాసభలకు తరలిరావాలి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 10: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలకు తరలిరావాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య అన్నారు. శనివారం జమ్మికుంటలో విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టాలని, విద్యను అంత ఒకే గొడుగు కిందకు తీసుకు వచ్చి అందరికి సమాన విద్యా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి, బాబన్న, కోడిగూటి తిరుపతి, మర్రి అవినాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

మానకొండూర్, ఫిబ్రవరి 10 : మానకొండూర్ పోలీసుల అదుపులో అంతర్ జిల్లా దొంగల ముఠా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మండల కేంద్రంలో ముగ్గురు వ్యక్తులు శనివారం అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ ముగ్గురు అంతర్ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించి పరారు కాగా మానకొండూర్ పోలీసులకు చిక్కినట్లు సమాచారం.

'దేశానికి పీవీ సేవలు చిరస్మరణీయం'


పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిల బ్రాహ్మణసేవా సంఘం బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 10: భారత దేశానికి ప్రధానిగా పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించిన సందర్భంగా శనివారం గాయత్రీ నగర్ గణేశ శారదా శంకరా లయంలో అఖిల బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్య క్రమం నిర్వహించారు. పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సంఘ బాధ్యులు మాట్లా డుతూ పురస్కారం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కస్పా భూమేశ్వర్‌రావు, గౌరవా ధ్యక్షులు నేదునూరి వామన్‌రావు, పురం ప్రేంచందర్‌రావు, పివి సాహిత్య పీఠం అధ్యక్షుడు కెవి సుభాషిణి సంతోష్ బాబు, జివి రంగారావు, దిలీప్ కుమార్, సంపత్ కుమార్, చిట్టంపల్లి శ్రీనివాసరావు, బొమ్మన రాధాకృష్ణారావు, శశికాంత్, అయాచితుల రాజేశ్వర్‌రావు, పెండ్యాల శ్రీనివాస రావు, విజయ్‌కుమార్, రామ్మోహన్, రవిశంకర్, శ్యామ్ పాల్గొన్నారు.

●పీవీ సాహిత్య పీఠం ద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడమే గాకుండా పీవీ పేరిట ప్రతీ యేటా పురస్కారాన్ని అందిస్తున్న పీఠం అధ్యక్షుడు కెవి సంతోష్‌బాబుకు సన్మానం చేశారు.

●పీవీకి భారతరత్న ప్రకటించడం పట్ల బొవెరా సంస్థల పక్షాన భారత స్వాతంత్ర్య సమరయోధుల కుటుం బాల జాతీయ వేదిక అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎన్‌జీవో పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మనోజ్, ముత్యంరావు, రాజేంద్రప్రసాద్, డాక్టర్ రామలింగారెడ్డి, తోట రాజేంద్రప్రసాద్, విద్యాసాగర్, మాధవరావు, సురేష్‌గౌడ్, కన్న య్య తిరుపతిరెడ్డి, రమేశ్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: పీవీ నర్సింహారావుకు భారత రత్న రావడం పట్ల బ్లాక్ బి అధ్యక్షులు మొలుగూరి సదయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధం చేయాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె ఈవీఎం గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎం, వీవీ ప్యాడ్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాడ్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. గోడౌన్ సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఆర్‌వో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: రాబోయే ఎన్నికల కోసం కరీంనగర్ ఈవీఎం గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల మొదటిస్థాయి తనిఖీని ఈసీఐ టెక్నికల్ మేనేజర్, ఎఫ్ఎల్‌సీ పర్యవేక్షకుడు నవీన్‌డొడ్డి పరిశీలించారు. శనివారం ఆయన ఈవీఎం, వీవీప్యాడ్‌ల ఫస్ట్‌లెవల్ చెకింగ్‌ను తనిఖీ చేసి వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో చర్చించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఆర్‌వో కిరణ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మానకొండూర్, ఫిబ్రవరి 10: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. మండలంలోని మానకొండూర్, అన్నారం, లలితాపూర్, శ్రీనివాస్‌నగర్ గ్రామాలలో పరిశుభ్రత వారోత్సవాలలో భాగంగా శానిటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు దయాకర్‌రావు, పవన్, మధుమిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సారార్ అధ్యాపకుడికి సన్మానం

గణేశ్‌నగర్,ఫిబ్రవరి10: శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్,సైన్స్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి చియాంగ్ మాయి యూనివర్సిటీ, థాయిలాండ్ అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ చేయడానికి వెళుతున్న సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కల్వ కుంట రామకృష్ణ, టీ.జీ.సీ.జీ.టీ.ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కడారు సురేందర్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్స్ టి.రాజయ్య, ప్రమోద్ కుమార్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన 'మాంటిస్సోరి అన్వేషణ్-23'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: నగరంలోని విద్యానగర్‌లో విద్యాసంస్కర్ మాంటిస్సోరి హౌజ్ ఆఫ్ చిల్డ్రన్ పాఠశాలలో శనివారం మాంటిస్సోరి అన్వేషణ్-2024 పేరిట నిర్వహించిన మేళాలో విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పిన్నింటి నారాయణరెడ్డి, డైరెక్టర్ సంగీతారెడ్డి పాల్గొన్నారు.

విభిన్న కళలకు పుట్టినిల్లు భారతదేశం

-సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ -ఘనంగా అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న ఆర్‌పీ పట్నాయక్, అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 10: భారతదేశం విభిన్న కళలకు పుట్టినిల్లు అని ప్రముఖ సినీ దర్శకులు ఆర్‌పీ పట్నాయక్ అన్నారు. శనివారం రాత్రి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో గ్లేర్ పేరుతో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడుతూ మన దేశంలో కళలకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. తల్లిదండ్రులు నిర్దేశించిన ఆశయాలను సరైన పద్ధతిలో సాధించి ఉత్తమంగా ఉండాలన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండే విధంగా ఐఐటీ, నీట్ ఫౌండేషన్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

నగరంలో మరో మోడ్రన్ దోబీఘాట్ నిర్మిస్తాం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: నగరంలో మరో మోడ్రన్ దోబీఘాట్‌ను నిర్మిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శనివారం నగరంలోని 34వ డివిజన్ గోదాంగడ్డ ప్రాంతంలోని మోడ్రన్ దోబీఘాట్ ఆవరణలో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ షకేర అంజుమ్ బర్కత్ అలీతో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంకమ్మతోట శ్రీమడేశ్వర రజక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ భవనానికి గతంలో నిధులు కేటాయించి మౌళిక వసతులను కల్పించామని అన్నారు. సంఘ సభ్యులు సమిష్టిగా ఉంటేనే సంఘం పటిష్టంగా ఉంటుందని అన్నారు. అన్ని సంఘాలకు అండగా ఉంటూ భవన నిర్మాణాలు, మౌళిక వసతులను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కల్పిస్తున్నామని చెప్పారు. కుల వృత్తిని చేసుకునే వారు గర్వంగా జీవించాలని, ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని నగర పాలక సంస్థ నుంచి 28 లక్షల రూపాయలతో మోడ్రన్ దోబీఘాట్‌ను నిర్మించామని అన్నారు. మరో 40,50 లక్షలు కూడా కేటాయించి షెడ్ నిర్మాణం చేస్తామని అన్నారు. హైజెనిక్ వసతులతో ఈ మాడ్రన్ దోబీఘాట్‌లను నిర్మించామని, పాతబజారులో కూడా మరో మాడ్రన్ దోబీఘాట్‌ను నిర్మించాలని నిర్ణయించామని అన్నారు. సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పాలకవర్గం కృషిచేస్తుందని మేయర్ సునీల్‌రావు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్యాస్, విద్యుత్ దరఖాస్తులపై అధికారుల సర్వే

- గ్రామాలు, పట్టణంలో వివరాలు సేకరణ
- సమగ్ర సమాచారం నమోదు


మంథినిపల్లిలో సర్వే చేస్తున్న విద్యుత్ అధికారులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 10: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తులను విద్యుత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి గ్యాస్, గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ప్రకటించింది. ఇందు కోసం అధికారులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుల్లో ఉన్న వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్, రేషన్‌కార్డుల వివరాలతో పాటు, ఫోన్ నంబర్లను తీసుకొని ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. డిసెంబరు 28నుంచి పది రోజుల పాటు ప్రజా పాలనలో భాగంగా ప్రజల నుంచి గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిం చారు. అయితే ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో సమగ్ర సమాచారం దరఖాస్తులలో పొందుపరచలేదు. దీంతో మళ్లీ దరఖాస్తుదారుడికి ఇంటికి వెళ్లి తప్పులను సవరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ హామీని ఇటీవలనే అమలు చేస్తామని ప్రకటించింది. మున్సిపాలిటీ గ్రామాల్లో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపడుతున్నారు.

నేడు ఎమ్మెల్సీ బల్మూరి రాక

హుజూరాబాద్, ఫిబ్రవరి 10: ఎమ్మెల్సీగా ఎన్నికై మొట్ట మొదటి సారిగా బల్మూరి వెంకట్ ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గానికి రానున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9గంటలకు సింగాపూర్‌కు చేరుకుంటారు. హుజూరాబాద్, జమ్మికుంటలలోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం బిజిగిరిషరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

డిగ్రీ అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ

జమ్మికుంట, ఫిబ్రవరి 10: తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం రూపొందించిన డిగ్రీ అడ్మిషన్ల పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంఘం రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ కడారి సురేందర్‌రెడ్డి ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగేందుకు పోస్టర్లను రూపొందించి ప్రతి కళాశాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్ల కోసం జూనియర్ కళాశాలలను సందర్శిస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎమ్ రామమోహన్‌రావు, రేణ ఈశ్వరయ్య, మహేందర్‌రావు, డాక్టర్ బి సువర్ణ, స్వరూపరాణి, డాక్టర్ ఈ రవి, రవీందర్, దేవేందర్‌రెడ్డి, మమత, అనూష, అరుణ్‌రాజ్, పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మానకొండూర్, ఫిబ్రవరి 10: మానకొండూర్ గ్రామానికి చెందిన తాళం వేసి ఉన్న మడుపు ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రేమ్‌కుమార్ మానకొండూర్‌లో వ్యాపారం చేస్తు జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కరీంనగర్‌కు వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని పగులకొట్టి బీరువాలోని 16తులాల వెండిని దొంగిలించుకపోయారని వాటి విలువ సుమారు రూ. 5వేలు ఇంటి యజమాని ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

సమ్మక్క జాతర పనులు ప్రారంభం

శంకరపట్నం, ఫిబ్రవరి 10: శంకరపట్నం మండలం కేశవపట్నంలో నిర్వహించే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర పనులను ఎంపీడీవో శ్రీవాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచినీటి వసతి, తాత్కాలిక మరుగుదొడ్లు, భక్తులు వేచి ఉండే స్థలం పనులు పూర్తి చేయాలని సూచించారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న ఉమ్మడి గురుకులాల వీటీజీ సెట్-2014 ప్రవేశ పరీక్షకు విద్యార్థులు సమయా నికి చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర గురుకులాల పేరెంట్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కేంద్ర పథకాలపై అవగాహన



బీజేపీ పథకాలను వివరిస్తున్న నాయకులు

తిమ్మాపూర్, ఫిబ్రవరి10: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డివిజన్‌లో శుక్రవారం రాత్రి గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రవసి కార్యకర్త, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాత్రి అలుగునూర్‌లోనే బీజేపీ శ్రేణులతో కలిసి నాగేశ్వర్ రెడ్డి భోజనం చేసి అక్కడే బస చేశారు. శనివారం ఉదయం బీజేపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివ రించారు. కార్యక్రమం అలుగునూర్ డివిజన్ కన్వీనర్ తోర్తి అరవింద్ నాయకులు సిరిసిల్ల నర్సయ్య, రేశవేని అనిల్, రాకేష్, మని మహర్షి, నరేష్, పవన్ కళ్యాణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్ 10: కరీంనగర్ భూసేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్‌గా, వరంగల్ స్పెషల్ కలెక్టర్(భూసేకరణ విభాగం)పీఏగా ఉన్న కిరణ్‌ప్రకాశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ భూసేకరణ స్పెషల్ కలెక్టర్‌గా ఉన్న పి సదానందంను వరంగర్ స్పెషల్ కలెక్టర్(భూసేకరణ విభాగం)పీఏగా బదిలీ అయ్యారు.

కొత్తపల్లి ఎస్ఐగా సాంబమూర్తి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 10: కొత్తపల్లి నూతన ఎస్ఐ సాంబమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అక్కడ పనిచేసిన ఎస్ఐ చంద్రశేఖర్‌ను వీఆర్‌కు బదిలి చేయగా, ఆయన స్థానంలో కరీంనగర్ ట్రాన్స్‌పోర్టు విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ సాంబమూర్తిని మూడు రోజుల క్రితం నియామకం చేశారు.

మొగ్దుంపూర్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 10: కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్దుంపూర్‌లో శనివారం అగ్ని ప్రమాదం జరిగగా లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ముగ్దుంపూర్ పెట్రోలు పంపు సమీపంలోగల మేకల పోచయ్యకు చెందిన ఇంటిలో మంటలు అంటుకొని బట్టలు, వంట సామగ్రి దగ్ధం అయ్యాయి. కరీంనగర్ ఫైర్ స్టేషన్‌నుంచి సిబ్బంది ఫైర్ స్టేషన్‌తో సహా సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా ఆర్పివేశారు. ఎలక్రిక్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటు అంటుకున్నట్లు కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

అనాథ పిల్లలకు సైకిళ్ల పంపిణీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 10: నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే పేద అనాధ విద్యార్థులకు ఉమెన్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 11 సైకిళ్లను అందించారు. పేద అనాధ పిల్లలకు లక్ష రూపాయల విలువైన 11సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులను కార్పొరేటర్ శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జమున, ప్రధానోపాధ్యాయురాలు కరుణ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల దరఖాస్తుల పరిశీలన

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 10: ఆరు గ్యారెంటీల దరఖాస్తులను కరీంనగర్‌రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో పరిశీలించారు. మహాలక్ష్మి గ్యాస్, ఎలక్ట్రిసిటి పథకంలో భాగంగా లబ్దిదారులను దరఖాస్తులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, కార్యదర్శి సంజీవరెడ్డి, గ్రామ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోరికా వార్షిక క్రీడా వేడుకలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 10: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ క్రీడా మైదానంలో ఖేలో కూదో మౌజ్ మనావో పేరితో ఎక్స్‌ప్లోరికా వార్షిక క్రీడా వేడుకలు శనివారం ఘనంగానిర్వహించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు పాఠశాల పతాక ఆవిష్కరణ చేసి పావురాలను గాలిలోకి వదిలిపెట్టారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, రాకేష్ ప్రాచీ, వినోద్‌రావు, వియుఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటస్ఫూర్తి ఆదర్శం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: సాయుధ పోరాట వీరనారి నిజాం దొరకలను తరిమిన ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకొని సంఘాలుగా ఏర్పడి హక్కుల సాధనకు ముందుకు రావాలని తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ వృత్తి రజక మహిళలకు పిలుపునిచ్చారు.

శనివారం నగరంలోని విద్యానగర్‌లో తెలంగాణ రజక సంఘం మహిళా విభాగం జిల్లా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశ్వరి, ఎలగందుల అర్చన, మామిడి లత, తుర్తి లక్ష్మీ, పున్నం కవిత, తొర్తి సరిత, జిల్లాకార్యదర్శి లింగంపెల్లి నాగయ్య, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌స్పోర్ట్, ఫిబ్రవరి10: కరీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్‌అకాడమీ, సంయుక్తంగా ఈనెల 25న నిర్వహించే రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీల పోస్టర్లను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్న వాగేవి డిగ్రీ,పీజీ

రైతాంగానికి మొండిచేయి

గంగాధర, ఫిబ్రవరి 10: రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే వారికి బడ్జెట్‌లో మొండి చేయి చూపిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం ఆయన బడ్జెట్‌పై విలేకరులతో మాట్లాడారు.. యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని గతంలో చెప్పిన హామీని బడ్జెట్‌లో విస్మరిం చిందని విమర్శించారు.

ట్రాక్టర్స్ యూనియన్ గ్రామ కార్యవర్గం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 10: మండలంలోని పోరండ్ల గ్రామంలో ట్రాక్టర్స్ యూనియన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగపూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మోరపల్లి వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా నాగపూరి శ్రీనివాస్, యాళ్ల మధుసూదన్‌రెడ్డి, తోడేంగ సంపత్, మోరపల్లి సంపత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎన్నికయ్యారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

వీణవంక, ఫిబ్రవరి10: మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మె పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిల్లి రవియాదవ్, కొప్పుల శంకర్, వెంకటేశ్, రాజయ్య, రమేశ్, శంకర్, సదానందం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్, లేబర్ యూనియన్ అధ్యక్షుడిగా కవ్వంపల్లి రవి

గన్నేరువరం, ఫిబ్రవరి 10, మండల కేంద్రానికి చెందిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ డ్రైవర్, లేబర్ యూనియన్ అధ్యక్షుడిగా కవ్వంపల్లి రవిని శనివారం ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా పాలెపు శంకర్, న్యాత సాగ ర్, ప్రధానకార్యదర్శిగా కోలపురి ఆంజనేయులు, కోశాధికారి నాగరాజు, కార్యదర్శి అంజయ్య, గౌరవ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

గుండ్లపల్లి మీదుగా బస్సులు నడపాలి

గన్నేరువరం, ఫిబ్రవరి 10: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా గాలిపల్లి, ఇల్లంతకుం ట వరకు బస్సులు నడపాలని మండల బ్రిడ్జి జేఏసీ అధ్యక్షుడు సంపతి ఉదయ్ శనివారం కరీంనగర్ 1డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మేడారం జాతర అనంతరం బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాము తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు చేరుకున్న మండల వాసులు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 10: మండల కేంద్రంతో పాటు మల్యాల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం ఉదయం అయోధ్యలోని బాలరాముని దర్శనానికి ప్రత్యేక రైలులో తరలివెళ్లారు. శనివారం నాయకులు సురేందర్‌రెడ్డి, సాంబయ్య, ఆరెల్లి శ్రీనివాస్, సాయిరెడ్డి, కొత్త శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు.